క్లుప్తంగా

ఘనంగా ఏకలవ్యుని జయంతి



వల్లూరులో ఏకలవ్యుని జయంతి వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

పెనుగొండ: గురుభక్తిని సమాజానికి చాటి చెప్పిన శిష్యుడు ఏకలవ్యుడని ఆచంట జెడ్పీటీసీ సభ్యుడు ఉప్పలపాటి సురేష్ బాబు అన్నారు. బుధవారం వల్లూరులో ఏకలవ్య జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఏకలవ్యుడు నిత్య సాధనతో నైపుణ్యాన్ని ధ్యానిస్తూ గురువు ద్రోణాచార్యుడు నుంచి ప్రేరణపొంది గొప్ప విలువిద్య సంపదను సాధించుకున్నాడని కొనియాడారు. కృషి, పట్టుదలను విద్యార్థులను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ తాళం శ్రీనివాస రావు, ఎంపీటీసీ ఆరుమిల్లి సుబ్బారావు, టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు దేవల రమేష్, నేలపూడి రామ్మోహనరావు, ఉప సర్పంచ్ గెద్దాడ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు త్రిమూర్తులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నరసాపురం రూరల్: మండలంలోని తూర్పుతాళ్లు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని తీరప్రాంత గ్రామాల్లో గురువారం విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఎలక్ట్రికల్ డీఈ బి.సురేష్ కుమార్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. చెట్ల కొమ్మలు తొలగింపు దృష్ట్యా గురువారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ తీరప్రాంత గ్రామాలైన పెదమైనవానిలంక, తూర్పుతాళ్లు, వేములదీవి, చినమైనవానిలంక, బియ్యపుతిప్ప, పసలదీవి, చామకూరిపాలెం గ్రామాలతో పాటు మొగల్తూరు మండలంలోని కేపీ పాలెం సబ్‌స్టేషన్ పరిధిలోని కేపీ పాలెం గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని ఎలక్ట్రికల్ డీఈ ఒక ప్రకటనలో కోరారు.

ఉత్సాహంగా పీర్ల ఊరేగింపు



వడలిలో పీర్ల ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

పెనుగొండ: మొహర్రం పర్వదినాన్ని పురస్కరించుకుని వడలిలో గురువు సజ్జాద్ తనయుడు రియాజ్ పయాజ్ ఆధ్వర్యంలో పీర్ల ఊరేగింపు నిర్వహించారు. బుధవారం పిట్టల వేమవేమవరం రోడ్డు నుంచి పోతురాజు గుడి వరవద్ద నాగూర్ మీరా సాహెబ్ సంబరం గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. గత 56 సంవత్సరాలుగా గౌడ సంఘం ఆధ్వర్యంలో పీర్ల ఊరేగింపు నిర్వహిస్తూ మత సామరస్యాన్ని, ఐక్యతను చాటుకుంటున్నారు. పీర్ల ఉత్సవంలో భాగంగా నిప్పుల గుండం తొక్కారు. అలాగే శనివారం భారీ అన్నసమారాధన నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

పేదలకు పండ్లు, బ్రెడ్ పంపిణీ

పెనుగొండ: మానవ సేవే మాధవ సేవగా భావించి ప్రతీ ఒక్కరూ సేవా మార్గంలో నడవాలని మానవత స్వచ్ఛంద సంస్థ పెనుగొండ మండల శాఖ అధ్యక్షుడు డాక్టర్ నల్లిమిల్లి విజయరాజు అన్నారు. బుధవారం పెనుగొండ ఎస్‌ఆర్‌కే విల్లాలో మండ ప్రసాద్ దంపతుల సహకారంతో పేదలకు పండ్లు, బ్రెడ్‌లు పంపిణీ చేశారు. మానవత కార్యదర్శి షేక్ మస్తాన్, కోశాధికారి నరసింహారావు, రీజనల్ చైర్మన్ బాణాల శ్రీనివాసరావు, కర్రి నరేంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు హెల్మెట్‌ధారణపై అవగాహన ర్యాలీ

పాలకొల్లు సెంట్రల్: రహదారులపై తిరిగే ప్రతి ద్విచక్రవాహనదారుడూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జియావుద్దీన్ షేక్ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం పట్టణంలో ఉదయం 9 గంటలకు కోర్టు ప్రాంగణం నుంచి గాంధీబొమ్మల సెంటర్ వరకూ ర్యాలీ నిర్వహించనున్నట్లు బుధవారం విలేకరులకు తెలిపారు. ఈ ర్యాలీలో న్యాయవాదులు, కళాశాల విద్యార్థులు, పోలీసులు పాల్గొనాలని కోరారు.

దళితవాడలను అభివృద్ధి చేయాలి

ఆకివీడు: దళిత వాడల అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు నన్నేటి పుష్పరాజ్ డిమాండ్ చేశారు. మండలంలోని తరటావ గ్రామంలో విద్యుత్ షాక్‌కు బలైన మాలమహానాడు గ్రామ కార్యదర్శి యాళ్ల రమేష్ కుటుంబాన్ని బుధవారం ఆయన పరామర్శించారు. రమేష్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు నూరుశాతం వినియోగించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రతి నియోజకవర్గంలో ఎమ్మెల్యే పర్యటించి దళితవాడల సమస్యల్ని గుర్తించాలన్నారు. వీటిలో అత్యవసరమైన పనులకు నిధులను తక్షణం కేటాయించే విధంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నేతల సువర్ణరాజు, నేతల సాల్మన్‌రాజు, తోర్లపాటి భాగ్యరాజ్, చిగురుపాటి రాజేష్ పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లుల చెల్లింపులో నూతన విధానం

- ఆర్‌బీఐ నిబంధనలతో యూపీఐ చెల్లింపులకు చెల్లు
- ఇకపై ఈస్ట్రన్ పవర్ మొబైల్ యాప్ ద్వారా చెల్లింపులు



యలమంచిలి: ఇప్పటి వరకు మీకు వచ్చే కరెంట్ బిల్లులను ఫోన్ పే, జీపే, పేటీఎం వంటి యూపీఐ యాప్‌లలో చెల్లిస్తున్నారు కదా...ఈ నెల బిల్లు కడదామంటే మీరు ఉపయోగించే యాప్‌లో రిజర్వ్ బ్యాంకు నిబంధనల ప్రకారం జూలై ఒకటి 2024 నుంచి ఈ చెల్లింపు కుదరదు అని వస్తుందా? అయితే కంగారుపడకండి. ఎందుకంటే యూపీఐ యాప్‌ల ద్వారా విద్యుత్ బిల్లుల చెల్లింపునకు ఏపీఈపీడీసీఎల్ స్వస్తి పలికింది. ఇక నుంచి కేవలం ఏపీఈపీడీసీఎల్ వెబ్‌సైట్, ఈస్ట్రన్ పవర్ మొబైల్ యాప్‌ల ద్వారా మాత్రమే చెల్లింపులకు అవకాశం కల్పించింది. థర్డ్‌పార్టీ యాప్‌లైన ఫోన్ పే, జీపే, పేటీఎం వంటి ఇతర యూపీఐ యాప్‌ల ద్వారా విద్యుత్ బిల్లుల చెల్లింపులను నిలిపేసింది.

కౌంటర్లు యథాతథం

విద్యుత్ బిల్లులు చాలా మంది విద్యుత్ రెవెన్యూ కేంద్రాల్లోని కౌంటర్లలో చెల్లిస్తారు. గ్రామీణ ప్రాంతాల్లో నెలకు ఒకసారి ఏపీఈపీడీసీఎల్ సిబ్బంది వచ్చి విద్యుత్ బిల్లులు కట్టించుకుంటారు. ఈ రెండు విధానాలు యథాతథంగా కొనసాగుతాయి. ప్రస్తుతం అందరి చేతుల్లో స్మార్ట్ ఫోన్ అందుబాటులో ఉన్న నేపథ్యంలో ఆర్థిక లావాదేవీలన్నీ ఫోన్ పే, జీపే, పేటీఎం వంటి మొబైల్ యాప్‌ల లోనే చెల్లిస్తున్నారు. ఆర్బీఐ భారత్ బిల్ పేమెంట్స్ మార్గదర్శకాల రకారం నేరుగా యాప్‌ల నుంచి చెల్లింపులను నిలిపి వేశారు.

ఈస్ట్రన్ పవర్ మొబైల్ యాప్ కూడా సులభం

సాధారణంగా యాప్‌ల ద్వారా విద్యుత్ బిల్లు చెల్లించడం సులభంగా ఉండడంతో చాలామంది వినియోగదారులు ఆ విధానంలోనే కడుతున్నారు. ఈ నేపథ్యంలో ఏపీఈపీడీసీఎల్ ప్రవేశపెట్టిన ఈస్ట్రన్ పవర్ మొబైల్ యాప్ కూడా చాలా సులభంగానే ఉంది. సెల్‌ఫోన్ వినియోగదాలు గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ స్టోర్ నుంచి ఈస్ట్రన్ పవర్ మొబైల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. యాప్ డౌన్‌లోడ్ అయ్యాక మీ విద్యుత్ బిల్లుకు లింకైన సెల్ నంబరు నమోదు చేయాలి. అప్పుడు ఓటీపీ వస్తుంది. ఓటీపీ నమోదు చేసిన తరువాత మీ పదహారు అంకెల విద్యుత్ కనెక్షన్ నెంబర్ అడుగుతుంది. దానిని నమోదు చేసిన తరువాత మీ యాప్ సిద్ధమవుతుంది. యాప్‌లో యాడ్ సరీ్వస్, బిల్ పే, కస్టమర్ కేర్, కంజషన్, కనెక్ట్, పేమెంట్ హిస్టరీ, ఆధార్ లింక్, మై యూసేజ్, సప్లై పొజిషన్ వంటి తొమ్మిది రకాల సేవలు ఉంటాయి. వాటిలో మీకు ఏది అవసరమైతే అది వాడుకోవచ్చు. ముఖ్యంగా ఈ యాప్ వల్ల బాగా ఉపయోగం ఏమిటంటే మై యూసేజ్‌లోనికి వెళ్లి నెల మధ్యలో అప్పటి వరకు మనం ఎన్ని యూనిట్లు విద్యుత్ వాడుకున్నామో? చూసి అంత వరకు బిల్లు అడిగితే చూపిస్తుంది. దీని వల్ల అద్దె ఇంటిలో ఉంటూ నెల మధ్యలో ఖాళీ చేసి వెళ్లిపోయేవారికి ఎంత బిల్లు కట్టాలో కచ్చితమైన సమాచారం వస్తుంది. పేమెంట్ హిస్టరీలో మనం చెల్లించిన పాత బిల్లుల సమాచారం కూడా లభిస్తుంది. బిల్‌పే మాత్రం ఈస్ట్రన్ పవర్ మొబైల్‌లో చేస్తున్న డబ్బులు చెల్లించే సమయంలో డెబిట్ కార్డు, క్రెడిట్ కార్డు, యూపీఐ యాప్‌లు, నెట్ బ్యాంకింగ్ ద్వారా చెల్లించే అవకాశం ఉంటుంది.

రిజర్వ్ బ్యాంకు ఆదేశాలకు అనుగుణంగా..



రిజర్వ్ బ్యాంకు ఆదేశాల ప్రకారం ఈ నెల నుంచి ఖచ్చితంగా ఈస్ట్రన్ పవర్ మొబైల్ లేదా ఏపీఈపీడీసీఎల్ వెబ్‌సైట్‌లో మాత్రమే విద్యుత్ బిల్లులు చెల్లించాలి. స్మార్ట్ ఫోన్ వాడడం తెలిసిన వారికి ఈస్ట్రన్ పవర్ మొబైల్ యాప్‌ను చాలా సులభంగా ఆపరేట్ చేస్తారు. మా సిబ్బంది కూడా వినియోగదారులకు ఈ యాప్‌పై అవగాహన కల్పిస్తున్నారు. ఒక్కసారి యాప్‌ను వినియోగిస్తే తరువాత చాలా సులభంగా విద్యుత్ బిల్లులు ఈ యాప్‌లో చెల్లిస్తారు.

– దున్న రాజీవ్, ఎలక్ట్రికల్ ఏఈ, యలమంచిలి

వైభవంగా తొలిఏకాదశి పూజలు



యలమంచిలి: కొంతేరు కుంతీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో ప్రదక్షిణ చేస్తున్న భక్తులు



మొగల్తూరు: శాకంబరి అలంకరణలో పార్వతీ దేవి

మొగల్తూరు: ఆషాఢ మాసంలో వచ్చే తొలిపండుగ అయిన తొలి ఏకాదశిని బుధవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని పలు గ్రామల్లో ఉన్న వేంకటేశ్వర స్వామి, రాజగోపాల స్వామి ఆలయాల్లో వేకువ జాము నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొగల్తూరులోని పురాతన శివాలయలోని పార్వతి దేవి ఆలయంలో అమ్మవారిని శాకంబరిగా అలంకరించి పూజలు జరిపారు.

వేములదీవిలో..

నరసాపురం రూరల్: తొలి ఏకాదశి పర్వదినాన్ని నరసాపురం మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. లక్ష్మణేశ్వరం, రాజుల్లంక, ఎల్బీచర్ల, వేములదీవి, ధర్బరేవు, కొప్పర్రు, చిట్టవరం గ్రామాల్లోని పలు ఆలయాల్లో ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని వేములదీవి పడమర గ్రామంలోని కాపులకొడపలో ఉన్న శ్రీ వైభవ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో తొలి ఏకాదశి సందర్భంగా పుష్పాలతో విశిష్ట అలంకరణ చే శారు.

కొంతేరులో 108 కలశల పూజ

యలమంచిలి: తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా బుధవారం కొంతేరు శ్రీ కుంతీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో అష్టోత్తర శత (108) సహస్ర ధారాభిషేకం నిర్వహించారు. భక్తులు 108 కలశాలతో ఈ పూజలో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు పూలపల్లి వేణునాథ్ భక్తులతో శాస్త్రోక్తంగా పంచామృతాభిషేకం, తులసి ఆకులు, సుగంధ ద్రవ్యాలు, పుష్పాలతో పూజ చేయించారు.

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

పోడూరు/పాలకొల్లు అర్బన్: రైతు సంక్షేమమే సీఎం చంద్రబాబు లక్ష్యమని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. రావిపాడు గ్రామంలో బుధవారం ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని రూ.2.89కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఆర్‌అండ్‌బి రహదారికి శంకుస్థాపన చేశారు. అలాగే రూ.10లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రహదారులకు శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గుంటూరి పెద్దిరాజు, సర్పంచ్ పెన్మెత్స విజయలక్ష్మి, మాజీ ఎంపీపీ పెన్మెత్స రామభద్రరాజు పాల్గొన్నారు. రాష్ట్రంలో పనిచేస్తున్న ఆశ వర్కర్లకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఇచ్చిన మినిట్స్ కాపీ సర్క్యులర్‌ను తక్షణం జీఓ ఇవ్వాలని ఆశ వర్కర్లు పాలకొల్లులో మంత్రి కార్యాలయంలో నిమ్మల రామానాయుడిని కలిసి వినతిపత్రం అందజేశారు. పాలకొల్లు గాంధీబొమ్మల సెంటర్‌లో గిరిజన హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో బుధవారం ఏకలవ్యుడి జయంతి వేడుకలు నిర్వహించారు. మంత్రి నిమ్మల ఏకలవ్యుడి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మీ. బుధవారం బాధ్యతలు స్వీకరించిన జిల్లా ఎస్పీ అస్మీ మంత్రి రామానాయుడును అతని కార్యాలయంలో కలిసి పూల మొక్కను అందజేశారు.



రావిపాడులో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు

నారుమడిపై నిమ్మరసం పిచికారీ చేయాలి

మొగల్తూరు: నీరు నిలిచిపోయిన నారుమడులపై నిమ్మరసాన్ని పిచికారీ చేస్తే రోగ నిరోధక శక్తి పెరుగుతుందని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తెలిపారు. మొగల్తూరు పంచాయతీ కుక్కలవారి తోటలో బుధవారం నిమ్మరసాన్ని తయారు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోడిగుడ్లు కలిపిన నిమ్మరసాన్ని పిచికారీ చేస్తే నారుమడికి రోగనిరోధక శక్తి పెరిగి నారు ఎదుగుదలకు ఉపయోగపడుతుందన్నారు. ఎకరా నారుమడిలో 250 మిల్లీ లీటర్ల నిమ్మరసాన్ని 100 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. కోడిగుడ్లు కలిపిన నిమ్మ రసం ఆరు నెలలు వరకు నిలువ ఉంటుందని, ఖర్చు కూడా తగ్గుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కర్రి లక్ష్మీ కుమారి, కె.మహాలక్ష్మి, రామలక్ష్మి దుర్గాభవాని, జి.కనక దుర్గాభవాని తదితరులు పాల్గొన్నారు.



కుక్కలవారితోటలో నిమ్మరసాన్ని తయారు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

రజకుల సమస్యలను పరిష్కరించాలి

వీరవాసరం: రజకుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని రజక సంఘ మండల నాయకులు పాలకోడేటి లక్ష్మణరావు డిమాండ్ చేశారు. నవుడూరు పద్దాలంకమ్మ వారి ఆలయ ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన మండల విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాటాడుతూ 50 సంవత్సరాలు దాటిన రజకులకు వెంటనే పింఛన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

పనుల్లో నాణ్యత పాటించాలి



గ్రామసభలో మాట్లాడుతున్న సర్పంచ్ శ్యామలాసోనీ

పెనుగొండ: గ్రామాల అభివృద్ధికి, వ్యవసాయ కార్మికులకు ఉపాధి కల్పనే లక్ష్యంగా ప్రారంభించిన ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఉపాధి పనుల్లో నాణ్యత పాటించాలని పెనుగొండ సర్పంచ్ నక్కా శ్యామలాసోనీ శాస్త్రి అన్నారు. బుధవారం పెనుగొండ పంచాయతీ ఆవరణలో ఉపాధి హామీ పథకం సోషల్ ఆడిట్‌లో భాగంగా నిర్వహించిన గ్రామ సభలో పాల్గొన్నారు. 11 నుంచి నేటి వరకూ నిర్వహించిన సామాజిక తనిఖీల్లో మూడు ఫిర్యాదులు పింఛన్లపైనా, నాలుగు అభ్యంతరంలో మాస్టర్ ఫీట్‌లో రావడంతో వాటిని చర్చించి పరిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్.శ్రీనివాస్ దొర, సామాజిక తనిఖీ మండల పరిశీలకుడు ఎంఈఓ డి.శుభాకరరావు, ఎస్‌ఆర్‌పీ ఎం.గోవింద, డీఆర్‌పీ టి.నాగరాజు, గ్రామ కార్యదర్శి టి.రత్నాకరరావు తదితరులు పాల్గొన్నారు.

నారుమడుల పరిశీలన



మొగల్తూరులో నారుమడిని పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి అబ్దుల్ రహీమ్

మొగల్తూరు: నారుమడుల్లో చేరిన నీటిని తొలగించి తగు జాగ్రత్తలు తీసుకుంటే సరిపోతుందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వ్యవసాయాధికారి అబ్దుల్ రహీమ్ తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాలకు మొగల్తూరు, రామన్నపాలెం గ్రామాల్లో నీట మునిగిన నారుమడులను బుధవారం ఆయన పరిశీలించారు. ఇటీవల కురిసిన వర్షాలకు మడుల్లో వర్షపు నీటిని తొలగించి నారుపై రెండు గ్రాముల కార్బ్‌డిజమ్ మందును లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. నారుమడులు వేయడం ఆలస్యమైనా లేదా సాగు పనులు చేపట్టడం ఆలస్యమైనా ఇప్పటి వరకు నారుమడులు వేయని రైతులు వెదజల్లే పద్ధతిని పాటించాలని ఆయన సూచించారు. ఎకరాకు 12 నుంచి15 కేజీల విత్తనాలు సరిపోతాయని వివరించారు.

ఘనంగా పదవీ విరమణ సత్కారం



మురళీకృష్ణంరాజు దంపతులను సత్కరిస్తున్న సంఘ నాయకులు

పాలకొల్లు అర్బన్: విధి నిర్వహణలో ఎంతో బాధ్యతాయుతంగా పనిచేయడంతో పాటు సంఘీయుల సమస్యలు పరిష్కరించడంలో మురళీకృష్ణంరాజు చేసిన సేవలు అభినందనీయమని పలువురు వక్తలు అన్నారు. ఏపీ ఎన్‌జీవో సంఘ పాలకొల్లు యూనిట్ కార్యదర్శి వేగేశ్న మురళీకృష్ణంరాజు పదవీ విరమణ సందర్భంగా పాలకొల్లు మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం జరిగిన సత్కార సభలో పలువురు సంఘ రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొని మాట్లాడారు. సంఘ అధ్యక్షుడు గుడాల హరిబాబు అధ్యక్షతన జరిగిన సత్కార సభలో ఏపీ ఎన్జీవోస్ జేఏసీ చైర్మన్ చోడగిరి శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి ఎన్వీ రామారావు, జేఏసీ జనరల్ సెక్రటరీ ఆర్ఎస్ హరనాథ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.శ్రీనివాసరావు, సీటీవో వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ బి.అనుపమ, ఈఓపీఆర్‌డీ కేఎం వైభవతి తదితరులు పాల్గొన్నారు.

చీమలకోడు కాలువ తవ్వకం పనుల ప్రారంభం



వరిధనంలో చీమలకోడు పంట కాలువ తవ్వకం పనులను చేస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: మండలంలోని వరిధనంలో చీమలకోడు పంట కాలువ తవ్వకం పనులకు బుధవారం శ్రీకారం చుట్టారు. ఇరిగేషన్ శాఖ నుంచి రూ.6.60లక్షల నిధులు మంజూరు కావడంతో మండల టీడీపీ అధ్యక్షుడు కోడి విజయభాస్కర్, కార్యదర్శి పాముల రజనీకుమార్ కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. ఈ పంట కాలువ మరమ్మతులు చేయడం వల్ల వర్షాకాలంలో పంట చేలు ముంపునకు గురికావన్నారు. కాలువలో తూడు, గుర్రపుడెక్క తొలగించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ వర్ధనపు కాంతారావు, దొడ్డా శ్రీనివాసరావు, మాతా రత్నంరాజు, మండెల త్రిమూర్తులు, ఉంగరాల నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి నివారణపై అవగాహన



కుష్టు వ్యాధి నివారణ వాల్‌పోస్టర్స్‌ను ఆవిష్కరిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

పాలకొల్లు అర్బన్: కుష్టురహిత దేశంగా భారత దేశం నిలవడానికి రోటరీ క్లబ్ పూర్తి సహకారం అందిస్తుందని క్లబ్ అధ్యక్షుడు రావాడ సతీష్ అన్నారు. జూలై 18 నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు ఆశ, వలంటీర్లతో నిర్వహించే ఇంటింటి సర్వేకి అవసరమైన వాల్‌పోస్టర్లను రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ముద్రించి అందించామని వివరించారు. పాలకొల్లు, నరసాపురం నియోజకవర్గాల్లోని 15 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో ఆశ, ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీలకు మెడికల్ ఆఫీసర్ల సహకారంతో డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ జక్కంపూడి రాంప్రసాద్ ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ ఇచ్చారని తెలిపారు. ఉల్లంపర్రు సచివాలయం వద్ద వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి జవ్వాజి కల్యాణ్, కోశాధికారి పోతాబత్తుల సత్యనారాయణ, రోటరీ పాస్ట్ ప్రెసిడెంట్ ఇమ్మిడి రాజేష్, క్లబ్ సభ్యులు ఆర్‌కేఎంఆర్ రాజు, చిలుకూరి భీమన్న, సలాది రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ యాత్ర



అరుణాచలంలో సిద్ధాంతం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1986-87 బ్యాచ్ విద్యార్థులు

పెనుగొండ: సిద్ధాంతంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1986–87 విద్యా సంవత్సరం పదో తరగతి విద్యార్థులు ఆత్మీయ యాత్ర నిర్వహించారు. వారం రోజుల పాటు సుమారు 50 మంది వారి కుటుంబ సభ్యులతో తమిళనాడులోని అరుణాచలం, సిరిపురం వంటి పుణ్యక్షేత్రాలను దర్శించుకుని బుధవారం సిద్ధాంతం గ్రామానికి చేరుకొన్నారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న విద్యార్థులను ఆదుకోవడంలోనూ, పాఠశాల అభివృద్ధిలోనూ 1986–87 వ సంవత్సర పూర్వ విద్యార్థులు తమదైన ముద్ర వేసుకున్నారు. కార్యక్రమానికి గ్రూపు కోఆర్డినేటరుగా చిలువూరి గంగాధర రాజు(శివ), మహిళా కో–ఆర్డినేటరుగా కముజు శశిదేవి పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ రీచార్జి ధరలను తగ్గించాలి



పోడూరులో ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

పోడూరు: పెంచిన సెల్‌ఫోన్ రీఛార్జి ధరలను వెంటనే తగ్గించాలని సీపీఎం పోడూరు శాఖ కార్యదర్శి బొంతు శ్రీను డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం స్థానిక బల్ల వంతెన వద్ద సీపీఎం నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి పిల్లి ప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటుపరం చేస్తూ ప్రజలపై మోయలేని భారాన్ని వేస్తుందన్నారు. ప్రభుత్వసంస్థలకు పెట్టుబడులు పెట్టకుండా ప్రైవేటు రంగాలకు వేలకోట్లు దారాదత్తం చేస్తుందన్నారు. ఒక పక్క వంటగ్యాస్, నిత్యావసర సరుకుల ధరలు పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతున్న తరుణంలో గోరుచుట్టుపై రోకలి పోటులా సెల్‌ఫోన్ రీఛార్జి ధరలు పెంచడం దారుణమైన నిర్ణయమన్నారు. ధర్నాలో డి.నాగేశ్వర రావు, కె.శేషగిరి, జోగి కనకం, జి.సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

'మధ్యాహ్న' కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

భీమవరం: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ మండల కార్యదర్శి ఇంజేటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన మధ్యాహ్న భోజన కార్మికుల సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడారు. ప్రభుత్వాలు మారుతున్నా ఏళ్ల తరబడి పిల్లలకు సేవలు అందిస్తున్నా మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. ప్రస్తుతం కార్మికులకు ఇస్తున్న రూ.3 వేలు జీతాన్ని ధరల పెరుగుదలకు అనుగుణంగా పెంచాలని, మెనూ చార్జీ పెంచాలని, గ్యాస్ సిలిండర్స్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలని కోరారు. మదీనా బేబీ అధ్యక్షత వహించారు. శాంభాని దుర్గ, పాండ్రంగి రాము పాల్గొన్నారు.

రోడ్లపై ఆవుల సంచారం కట్టడికి వినతి

భీమవరం (ప్రకాశం చౌక్): రోడ్ల మీదకు విచ్చలవిడిగా ఆవులను వదులుతున్న యజమానులను గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని భీమవరం మున్సిపల్ కమిషనర్ ఎం.శ్యామలకు గోసంరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు సుంకర దాసు బుధవారం వినతిపత్రం అందజేశారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో రోడ్లపై తిరిగే ఆవుల సంఖ్య విపరీతంగా పెరిగిపోయిందని, వీటి వల్ల తరచూ వాహనాల రాకపోకలకు అంతరాయం కలగడమే కాక ఒక్కో సందర్భంలో ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. దీంతో పశువైద్యులను తీసుకెళ్లి ఆవులకు చికిత్స అందిస్తున్నామన్నారు. అలాగే వారానికి 10 నుంచి 15 ఆవులు చనిపోతున్నాయని, వాటికి తమ బృందం అంత్యక్రియలు నిర్వహిస్తోందన్నారు. పట్టణంలో రోడ్లను సొంత ప్రదేశాలుగా భావిస్తూ మూగజీవాలను రోడ్లమీదకు వదిలేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకుని గోవులను రక్షణకు చర్యలు తీసుకోవాలని కోరారు.